క్లుప్తంగా...

కేశవనగర్‌లో తాగునీటి సమస్యను పరిష్కరిస్తాం


తాగునీటి సమస్యపై అధికారులతో చర్చిస్తున్న మేయర్

బోడుప్పల్: 7వ డివిజన్ పరిధిలోని కేశవనగర్ కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి అన్నారు. జలమండలి జీఎం శ్రీనివాస్‌రెడ్డి, మేనేజర్ మమత, బీఆర్‌ఎస్ 7వ డివిజన్ సీనియర్ నాయకులు కాటపల్లి రాంచంద్రారెడ్డితో కలిసి ఆయన బుధవారం కేశవనగర్‌లో పర్యటించారు. స్థానిక ప్రజల నుంచి తాగునీటి కొత్త పైపులైన్ వేసి కాలనీ ప్రజల దాహార్తిని తీర్చాలనే వినతి మేరకు ఆయన సానుకూలంగా స్పందించారు. త్వరలో కొత్త పైపులైన్లు వేసి తాగు నీటిని అందిస్తామని కాలనీ ప్రజలకు ఆయన హామీ ఇచ్చారు. కాలనీవాసులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు లేకుండా చూడాలి


కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ రాజ్యలక్ష్మీ

మౌలాలి: వినాయక్‌నగర్ డివిజన్ పరిధిలో బుధవారం కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మీ పర్యటించారు. వినాయక్‌నగర్ వీధి నెంబర్-40లో కొన్ని సంవత్సరాలుగా రోడ్డు మధ్యలో విద్యుత్ పోల్ ఉండటంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే స్పందించిన ఆమె విద్యుత్ ఏడీఈ యాదగిరితో మాట్లాడి విద్యుత్ పోల్‌ను తరలించారు. డివిజన్ పరిధిలో విద్యుత్ సమస్యలు లేకుండా చూడాలని ఆమె తెలిపారు. కాలనీవాసులు పాల్గొన్నారు.

ఉప్పల్ బీజేపీ అభ్యర్థిగా అవకాశం ఇవ్వండి

మల్లాపూర్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఉప్పల్ అసెంబ్లీ బీజేపీ అభ్యర్థిగా తనను ప్రకటించాలని కోరుతూ నాచారం డివిజన్‌కు చెందిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, అంపాల పద్మారెడ్డి రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో సీటు కోసం బుధవారం దరఖాస్తు చేసుకున్నారు. అనంతరం పద్మారెడ్డి మాట్లాడుతూ ఉప్పల్ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, ఒక్క అవకాశం ఇచ్చి చూడాలని, ఉప్పల్ నియోజకవర్గ రూపురేఖలను మార్చేస్తానన్నారు.

అభివృద్ధి పనులపై డీసీతో సమీక్ష

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్ అభివృద్ధి పనులు, సమస్యలపై బుధవారం కార్పొరేటర్ బొంతు శ్రీదేవి, కాప్రా సర్కిల్ డీసీ ముకుందరెడ్డితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డివిజన్‌లో చేపట్టనున్న అభివృద్ధి పనులు, సమస్యలపై డీసీతో చర్చించారు. పనులు సకాలంలో పూర్తయ్యేలా చూడాలని కోరారు. డివిజన్‌లో నెలకొన్న సమస్యలను ఆయా శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. డివిజన్‌పై దృష్టి సారించి సకాలంలో పనులు పూర్తయ్యేలా సహకరించాలని కోరారు. ఏఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



మల్లాపూర్: నాచారం వెస్లీ కో ఎడ్యుకేషన్ హైస్కూల్ 1997–98 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నాచారంలోని చంద్ర గ్రాండ్ హోటల్‌లో బుధవారం నిర్వహించారు. విద్య నేర్పిన ఉపాధ్యాయులు స్వామి దాస్, ఇందిరాను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు సీహెచ్.రమేష్, శ్రీనివాస్, నర్సింగ్, మోహన్, బొదాసు రవి, శ్రీనివాస్, భాస్కర్ , రఘువేంద్ర తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు స్థలాలివ్వాలి

సాక్షి, మేడ్చల్ జిల్లా: అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇస్తామన్న హామీని బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిలబెట్టుకోవాలని తెలంగాణ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తొటకూరి వజ్రేష(జంగయ్య) యాదవ్ కోరారు. బుధవారం పీర్జాదిగూడలో మీడియాతో ఆయన మాట్లాడుతూ 15 రోజుల్లో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వకపోతే కలెక్టరేట్ ఎదుట ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని హెచ్చరించారు. బీఆర్‌ఎస్ కార్యాలయం కోసం స్థలం కేటాయించినట్లుగానే.. ప్రెస్‌క్లబ్‌లకు స్థలాలు కేటాయించి, భవనాలు నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. జిల్లా మంత్రి మల్లారెడ్డి ఈ విషయాల్లో ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో రాబోయే కాంగ్రెస్ ప్రభుత్వంలో జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలను కేటాయించి, పక్కా ఇళ్లు నిర్మించి ఇస్తామన్నారు.

గొర్రెల పంపిణీ లక్ష్యం పూర్తయ్యేనా..?

గొల్ల, కురుమల ఆర్థికాభివృద్ధికి గొర్రెల పంపిణీ పథకాన్ని ప్రవేశపెట్టిన సర్కారు

- మొదటి విడతలో గొర్రెల పంపిణీ సజావుగానే సాగినా.. రెండో విడతలో నత్తనడక
- 1296 యూనిట్ల గొర్రెల పంపిణీకి.. చేసింది 90 యూనిట్లు మాత్రమే..



సాక్షి, మేడ్చల్ జిల్లా: గొర్రెల పెంపకాన్ని ప్రధాన వృత్తిగా జీవనం సాగిస్తున్న గొల్ల, కురుమల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం గొర్రెల పంపిణీ పథకాన్ని అమలు చేస్తోంది. 2017 సంవత్సరంలో ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని పరిశీలిస్తే.. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో గొర్రెల పంపిణీ కార్యక్రమం పూర్తవుతుందా లేదా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మొదటి విడతలో గొర్రెల యూనిట్ల పంపిణీ సజావుగానే సాగినా.. రెండో విడతలో మాత్రం నత్తనడకన సాగుతోంది. ప్రభుత్వం ఈ ఏడాది జూన్‌లో రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి.. రెండు నెలలు పూర్తయినా పథకం అమలులో వేగం తగ్గినట్లు కనిపిస్తోంది. దీనికి తోడు గొర్రెల పంపిణీ పథకానికి జాతీయ సహకార అభివృద్ధి సంస్థ(ఎన్‌సీడీసీ) రుణం అందించేందుకు విముఖత చూపడంతో అమలు ఆలస్యమైనట్లు తెలుస్తోంది. దీనికి తోడు ఎన్నికలు సమీపిస్తుండటంతో (ఎన్నికల కోడ్ అమలులోకి రాక ముందే) గుర్తించిన లబ్ధిదారులకు త్వరగా అందించేందుకు ప్రభుత్వం ఇతర ఆర్థిక సంస్థలు, బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకొని పథకాన్ని వేగవంతం చేసేందుకు ప్రత్యేక దృష్టి సారించింది. దీంతో లబ్ధిదారుల్లో కొత్త ఆశలు చిగురించాయి.

లబ్ధిదారుల పడిగాపులు

ప్రభుత్వం 2017లో గొర్రెల పంపిణీ పథకాన్ని ప్రవేశపెట్టింది. మేడ్చల్ జిల్లాలో గొర్రెల పంపిణీ పథకం కింద మొత్తంగా 5,160 మంది లబ్ధిదారులను ఎంపిక చేసింది. మొదటి విడతలో దశలవారీగా 3,864 మందికి గొర్రెల యూనిట్లను అందజేశారు. ఒక్కో యూనిట్లో 20 గొర్రెలు, ఒక పొట్టేలు చొప్పున పంపిణీ చేశారు. రెండో విడతలో కూడా కొంత మందికి అప్పట్లోనే గొర్రెలు అందజేశారు. ఆ తర్వాత ప్రభుత్వం నుంచి ఆదేశాలు లేక పోవడంతో గొర్రెల పంపిణీ నిలిచిపోయింది. మళ్లీ ఈ పథకాన్ని కొనసాగిస్తున్నట్లు ప్రభుత్వం రెండు నెలల కిందట ప్రకటించడంతో.. ఇంకా మిగతా 1296 మంది లబ్ధిదారులకు గొర్రెలు పంపిణీ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. వీరిలో 102 మంది లబ్ధిదారులు డీడీలు చెల్లించారు. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా నుంచి తెప్పించిన గొర్రెలను ఇప్పటి(బుధవారం) వరకు 90 మందికి అందజేశారు. మిగిలిన లబ్ధిదారులకు సత్వరమే అందజేసేందుకు జిల్లా పశుసంవర్ధక శాఖ ఏర్పాట్లు చేస్తోంది.

పకడ్బందీగా చర్యలు..

ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా లబ్ధిదారులకు గొర్రెలు పంపిణీ చేసేలా పశుసంవర్ధక శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. లబ్ధిదారుల కుల, ఆధార్, బ్యాంకు, నామినీ పత్రాల సేకరణను పూర్తి చేశారు. ఒక వేళ లబ్ధిదారుడు చనిపోతే.. నామినీగా ఉన్న భార్య లేదా కుమారులకు పంపిణీ చేసేలా ప్రక్రియను రూపొందించారు. పూర్తి వివరాలను ఈ ల్యాబ్ పోర్టల్లో అప్‌లోడ్ చేస్తున్నారు. పారదర్శకత కోసం జీపీఎస్ విధానం ఉన్న వాహనాల్లోనే గొర్రెలను రవాణా చేస్తున్నారు.

యూనిట్ విలువ పెంపుతో..

గతం విలువతో పోలిస్తే గొర్రెల యూనిట్ ధర పెరిగింది. మొదటి విడత సమయంలో గొర్రెల యూనిట్ రూ.1.25 లక్షలు ఉంది. లబ్ధిదారుల వాటా రూ.31,250 కాగా మిగతా సొమ్మును ప్రభుత్వం భరించింది. ప్రస్తుతం యూనిట్ విలువ రూ.1.75 లక్షలకు చేరింది. దీంతో లబ్ధిదారుల వాటా రూ.43,750కి చేరగా, గతంలో పోలిస్తే రూ.12.500 అదనంగా చెల్లించాల్సి వస్తోంది. లబ్ధిదారులు తమ వాటా మొత్తాన్ని ఆన్‌లైన్‌లో నేరుగా జమ చేశారు.

పంపిణీ వేగవంతం చేస్తాం..

రెండో విడత లబ్ధిదారులకు గొర్రెల యూనిట్లను అందించేందుకు కార్యాచరణను వేగవంతం చేశాం. జిల్లాలో 1296 మంది లబ్ధిదారులు ఉండగా.. 102 మంది డీడీలు చెల్లించారు. వీరిలో ప్రస్తుతం 90 మందికి అందించాం. మిగతా వారికి అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఒకటి, రెండు నెలల్లో లబ్ధిదారులందరికీ గొర్రెలను అందించేలా ప్రభుత్వం దృష్టి సారించింది. నిరంతర ప్రక్రియగా గొర్రెల పంపిణీ పథకం అమలు కానుంది.

– పి.శేఖర్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి, మేడ్చల్–మల్కాజిగిరి

అమరులకు గౌరవం ఇదేనా..?

- ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఆగ్రహం
- లెఫ్టినెంట్ కల్నల్ ఉప్పల వినయ్‌భానురెడ్డి విగ్రహావిష్కరణ
- తొలగించాలని చూసిన జీహెచ్‌ఎంసీ అధికారులు
- చెరువులు, భూకబ్జాదారులపై ప్రతాపం చూపండి
- అర్ధరాత్రి ధర్నా, విగ్రహ ఆవిష్కరణ


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు తదితరులు

మల్కాజిగిరి: దేశం కోసం ప్రాణత్యాగం చేసే అమరులకు అధికారులు ఇచ్చే గౌరవం ఇదేనా..? అని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ప్రశ్నించారు. లెఫ్టినెంట్ కల్నల్ వినయ్ భానురెడ్డి విగ్రహావిష్కరణ ఉద్రిక్తతకు దారితీసింది. ఈ ఏడాది మార్చిలో విధి నిర్వహణలో ఉన్న వినయ్‌భానురెడ్డి హెలికాప్టర్ ప్రమాదంలో మృతి చెందాడు. మల్కాజిగిరికి చెందిన వినయ్‌భానురెడ్డి విగ్రహాన్ని రాజకీయాలకు అతీతంగా మౌలాలి జెడ్‌టీసీ క్రాస్‌రోడ్స్‌లో వారి కుటుంబసభ్యులు ఏర్పాటు చేశారు. విగ్రహావిష్కరణ బుధవారం ఉదయం జరగాల్సి ఉండేది. మంగళవారం అర్ధరాత్రి జీహెచ్‌ఎంసీ అధికారులు, పోలీసు బందోబస్తుతో విగ్రహాన్ని తొలగించడానికి ప్రయత్నిస్తున్నారని తెలుసుకున్న మైనంపల్లి హన్మంతరావు అనుచరులు, స్థానికులు పెద్దఎత్తున అక్కడికి చేరుకొని ధర్నా నిర్వహించారు. విజయవాడ అమ్మవారి దర్శనానికి వెళ్లిన ఎమ్మెల్యే నేరుగా అక్కడికి చేరుకొని స్థానిక కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్‌తో కలిసి విగ్రహావిష్కరణ చేశారు.

అమరులకు ఇచ్చే గౌరవం ఇదేనా..?

అమరులకు అధికారులు ఇచ్చే గౌరవం ఇదేనా అని ఆయన ప్రశ్నించారు. ఆర్మీలో ఉన్నవారంటే దేశభక్తులని అధికారులు గమనించాలన్నారు. జీహెచ్‌ఎంసీ కమిషనర్ అర్ధరాత్రి విగ్రహాన్ని తొలగించడానికి ప్రయత్నించడం సరికాదన్నారు. నగరంలో చెరువులు కబ్జా అవుతున్నా, భూకబ్జాలకు పాల్పడుతున్నా పట్టించుకోవడం లేదన్నారు.

'స్టెమ్'లో విద్యార్థులకు ఉచిత శిక్షణ

సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ ఎన్‌జీవో స్మైల్ ఫౌండేషన్, టెక్నాలజీ సేవలు అందించే షెల్‌తో కలిసి ఎన్ఎక్స్ప్లోరర్స్ జూనియర్ పేరిట ఓ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా చేపడుతోంది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథమ్యాటిక్స్(స్టెమ్)లో శిక్షణ అందించేందుకు దీన్ని నిర్వహిస్తున్నామని, తొలిగా వరంగల్, ఖమ్మం జిల్లాల్లో 70 పాఠశాలల్లో వీటిని ప్రారంభించామని నిర్వాహక సంస్థ ప్రతినిధులు నగరంలో నిర్వహించిన సమావేశంలో తెలిపారు. దేశవ్యాప్తంగా 25వేల మందికి ఏడాది పాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తామని, స్టెమ్ ప్రాధాన్యతను విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తామని వివరించారు. కార్యక్రమ పోస్టర్‌ను నిర్వాహకులు విడుదల చేశారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

ఉప్పల్: అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి చెందిన ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. వివరాలు.. ఉప్పల్ లక్ష్మీనారాయణ కాలనీలో నివాసం ఉంటున్న కృష్ణ ఉప్పల్ శానిటేషన్ విభాగంలో పనిచేస్తున్నాడు. అతడి భార్య పి.రాణి అలియాస్ అనురాధ(46) కల్లుకు బానిసైంది. బుధవారం కృష్ణ విధుల నుంచి వచ్చే సరికి అపస్మారక స్థితిలో ఉంది. 108 సిబ్బంది వచ్చి ఆమె మృతి చెందినట్లు చెప్పడంతో పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని అనుమానాస్పద మృతిగా కేసు దర్యాప్తు ప్రారంభించారు.

ఆస్పత్రులు సేవాభావంతో పనిచేయాలి


డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఉప్పల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి

కుషాయిగూడ: ప్రైవేటు ఆస్పత్రులు సేవాభావంతో పనిచేస్తేనే మంచి గుర్తింపు లభిస్తుందని ఉప్పల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి అన్నారు. నాగార్జుననగర్ కాలనీలోని సన్‌సీడ్ ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన డయాలసిస్, పిల్లల చికిత్స, కంటి వైద్య చికిత్స విభాగాలను బుధవారం ఆయన జిల్లా గ్రంథాలయ చైర్మన్ దర్గా దయాకర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. నాణ్యమైన వైద్యం అందించే దిశగా దృష్టి సారించాలన్నారు. వైద్య పరీక్షలకు 30 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ అన్వేష్ కలుకూరి తెలిపారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ భానుచందర్, డాక్టర్ తేజస్విని, డాక్టర్ లావణ్య, డాక్టర్ వైష్ణవి, డాక్టర్ ఋషివర్ధన్‌రెడ్డి, సాహితిరెడ్డి, ఆసుపత్రి సీఈఓ కల్యాణి రాములు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక పేదలకు ఒక్క డబుల్ ఇల్లు ఇవ్వలేదు

టీపీసీసీ ఉపాధ్యక్షుడు తొటకూరి వజ్రేష్‌యాదవ్



సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో జీహెచ్‌ఎంసీ వారు డబుల్ బెడ్ ఇళ్లు నిర్మించి, స్థానికులకు ఒక ఇల్లు కూడా కేటాయించకుండా చిన్నచూపు చూడటంపై తెలంగాణ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తొటకూరి వజ్రేష్(జంగయ్య) యాదవ్ తీవ్రంగా ధ్వజమెత్తారు. జిల్లాలోని ప్రభుత్వ స్థలాల్లో వందలాది ఇళ్లు కట్టి, ఇక్కడి పేదలను విస్మరించినా.. స్థానిక కార్మిక మంత్రి మల్లారెడ్డి పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వ భూములను కాపాడిన ప్రజలకే న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఒక మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోనే 80 వేల మంది పేదలు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో 30 శాతం మంది అర్హులని పేర్కొన్న బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు వారికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఎక్కడి నుంచి ఇస్తారో తెలపాలని ఆయన డిమాండ్ చేశారు. రానున్న ఎన్నికల్లో మేడ్చల్‌లో గెలిచేది కాంగ్రెస్ పార్టీ అని ఆయన జోస్యం చెప్పారు.

మేడ్చల్ కాంగ్రెస్ టికెట్ నాకే.. సీఎం రేవంతే..

రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం ఖాయమని, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేష్ యాదవ్ తెలిపారు. మేడ్చల్‌లో కాంగ్రెస్ పార్టీ నుంచి తానే పోటీ చేస్తానని, అనుమానమేమీ లేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ బీసీ సామాజిక వర్గానికి టికెట్ కేటాయిస్తే బరిలో ఉంటానని, ఓసీ సామాజిక వర్గానికి ఇస్తే హరివర్ధన్‌రెడ్డి ఉంటారని, మా ఇద్దరికీ కాదని, ఇతరులకు టికెట్ ఇచ్చే అవకాశమేలేదని వజ్రేష్‌యాదవ్ తెలిపారు. సమావేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సరిత వెంకటేష్, పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు తుంగతుర్తి రవి, ఘట్కేసర్ మండల్ అధ్యక్షుడు కర్రె రాజేష్, నాగారం మున్సిపాలిటీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి, జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్, గుండ్ల పోచమ్మపల్లి మున్సిపాలిటీ అధ్యక్షుడు సాయిపేట శ్రీనివాస్, ఘట్‌కేసర్ మున్సిపాలిటీ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఆంజనేయులు యాదవ్ పాల్గొన్నారు.

రూ.5.34 కోట్లతో సామాజిక సేవా కార్యక్రమాలు

కొమురంభీం జిల్లా కలెక్టర్‌తో ఈసీఐఎల్ ఒప్పందం


కలెక్టర్ హేమంత్ బోర్కడేతో ఒప్పందం చేసుకుంటున్న ఈసీఐఎల్ అధికారులు

కుషాయిగూడ: సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ ఈసీఐఎల్ 2023–24 ఆర్థిక సంవత్సరానికి రూ.5.34 కోట్ల బడ్జెట్‌ను కేటాయించింది. కొమురంభీం, ఆసిఫాబాద్ జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద విద్యార్థులకు సంపూర్ణ ఆరోగ్యం, పౌష్టికాహారం అందించడంతో పాటు పాఠశాలల్లో మెరుగైన మౌలిక వసతులు, నాణ్యమైన విద్యాబోధన, తరగతి గదుల నిర్మాణం, అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణం వంటి కార్యక్రమాలు చేపట్టేందుకు కార్యాచరణ చేసింది. ఇందుకు సంబంధించి బుధవారం జిల్లా కలెక్టర్ హేమంత్ బోర్కడేతో ఈసీఐఎల్ హెచ్ఆర్ ఏజీఎం సి.మునికృష్ణ, హెచ్‌ఆర్ మేనేజర్ రామకృష్ణ ఒప్పంద పత్రాలు అందజేసుకున్నారు.

బీఎల్‌ఆర్‌కు మద్దతు ప్రకటించిన బొంతు శ్రీదేవి


బీఎల్‌ఆర్‌కు మద్దతు తెలుపుతున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

కుషాయిగూడ: బీఆర్‌ఎస్ ఉప్పల్ నియోజకవర్గ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డికి చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి మద్దతు ప్రకటించారు. బుధవారం ఆమె నివాసానికి వచ్చిన బీఎల్‌ఆర్‌కు స్వాగతం పలికి ఘనంగా సత్కరించింది. పార్టీ అధిష్టానం నిర్ణయానికి తామంతా కట్టుబడి ఉంటామన్నారు. బండారి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించి మరోమారు ఉప్పల్ గడ్డపై బీఆర్‌ఎస్ జెండాను ఎగురవేస్తామన్నారు. బీఆర్‌ఎస్‌లో గ్రూపు రాజకీయాలకు తావుండదని ఆమె స్పష్టం చేశారు. బొంతు శ్రీదేవి మద్దతు పట్ల బండారి లక్ష్మారెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. అందరినీ కలుపుకొని పోతనన్నారు.

ఉప్పల్ టికెట్‌ను ఎన్‌వీఎస్‌ఎస్ ప్రభాకర్‌కే కేటాయించాలి


కిషన్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న ఉప్పల్ బీజేపీ నేతలు

ఉప్పల్: అసెంబ్లీ ఎన్నికల్లో మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్‌కే ఉప్పల్ టికెట్‌ను కేటాయించాలని కోరుతూ బుధవారం ఉప్పల్‌కు చెందిన బీజేపీ నేతలు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ప్రభాకర్ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఉప్పల్ అభివృద్ధిని పరుగులు పెట్టించారని, ఇప్పుడు ఉప్పల్ ప్రజలు ప్రభాకర్‌ను గెలిపిస్తారని తెలిపారు. గొరిగె కృష్ణ, మహంకాళి లక్ష్మణ్, దేవేందర్‌రెడ్డి, రేవల్లి రాజు, రావుల బాలకృష్ణ, బొంగు రమేష్, సింకారం కార్తీక్ ఉన్నారు.

నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలి



కుషాయిగూడ: నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలని జైళ్లశాఖ హైదరాబాద్ రేంజ్ డీఐజీ డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. చర్లపల్లి ఖైదీల వ్యవసాయ క్షేత్రంలో బుధవారం నిర్వహించిన హరితహారం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జైలు ఆవరణలో మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం తలపెట్టిన హరితహారంలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. చర్లపల్లి జైలు పర్యవేక్షణాధికారి సంతోష్‌కుమార్ రాయ్, ఓపెన్ ఎయిర్ జైలు పర్యవేక్షణాధికారి టి. కళాసాగర్, చంచల్‌గూడ జైలు పర్యవేక్షణాధికారి శివకుమార్ గౌడ్, మహిళా కారాగార పర్యవేక్షణాధికారి వెంకటలక్ష్మి, రంగారెడ్డి డీఎస్‌జేఓ రాంచందర్ పాల్గొన్నారు.

ప్రగతి కిష్టమ్మ ఎన్‌క్లేవ్ కాలనీ నూతన కమిటీ


కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్‌తో కాలనీ కమిటీ ప్రతినిధులు

అల్వాల్: అల్వాల్ డివిజన్ ప్రగతి కిష్టమ్మ ఎన్‌క్లేవ్ కాలనీ నూతన ఎన్నిక బుధవారం జరిగింది. అధ్యక్షుడిగా సందీప్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా దివాకర్, జీఎస్ ఉమామహేశ్వర్, జీఎస్ దీప, వేద, సూధాకర్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు స్థానిక కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా కాలనీ పారిశుధ్యం, పార్కు అభివృద్ధి, కమ్యూనిటీ హాల్ నిర్మాణం అంశాలను కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ హామీ ఇచ్చారు.

ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు


జేజీఆర్ స్కూల్‌లో కృష్ణుడు గోపిక వేషధారణలో చిన్నారులు







బోడుప్పల్: బృందావన్ కాలనీలోని జేజీఆర్ ఉన్నత పాఠశాలలో బుధవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ గంగరాజు మాట్లాడుతూ విద్యార్థులు కృష్ణుడు, గోపికల వేషధారణలో ఆకట్టుకున్నారన్నారు. మన సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించే విధంగా మన పండగలు జరుపుకోవాలన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీనికేతన్‌లో..

కుషాయిగూడ: మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ, అన్నపూర్ణ కాలనీలోని శ్రీనికేతన్ హైస్కూల్‌లో బుధవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ చిక్క నర్సింహ, ఇన్‌చార్జి లావణ్య, సిబ్బంది బబిత, అనిత, దివ్య, భాగ్య, శాంతి పాల్గొన్నారు.

కృష్ణుడి ఆలయంలో..

మల్కాజిగిరి: కృష్ణాష్టమి వేడుకలు మల్కాజిగిరి, ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్లలో ఘనంగా జరిగాయి. పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మారుతీనగర్ ఆంజనేయస్వామి దేవాలయం ఆవరణంలోని కృష్ణుడి ఆలయంలో అర్చకులు శ్యామ్‌ప్రసాద్ శర్మ పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

శ్రీనికేతన్ పాఠశాలలో..

మల్లాపూర్: నాచారం అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్లో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. డైరెక్టర్ శివకుమార్, కరస్పాండెంట్ కల్పన, ప్రిన్సిపల్ రష్మీజైశ్వాల్ పాల్గొన్నారు.


కృష్ణాష్టమి వేడుకల్లో బచ్‌పన్ స్కూల్ విద్యార్థులు,


నేరేడ్‌మెట్‌లోని వివేకానందపురంలో..